


వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా అప్పలనాయుడు

శ్రీకాకుళం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్‌గా ఎస్.అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈయన విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. అక్కడ నుంచి ప్రమోషన్‌పై జిల్లా వైద్య కళాశాలకు వస్తున్నారు. అలాగే ఆంధ్ర వైద్య కళాశాల సూపరింటెండెంట్ జె.కిషోర్ పదోన్నతిపై పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఇక్కడి సూపరింటెండెంట్ అల్లు పద్మజను విజయనగరం ఆసుపత్రికి బదిలీచేశారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఉత్తమ గురువులు

- రాష్ట్రస్థాయి అవార్డుకు జిల్లా నుంచి ముగ్గురు మహిళా టీచర్ల ఎంపిక
- రేపు సీఎం చంద్రబాబు ప్రదానం



నీరజ



అరుణకుమారి



విజయభారతి

శ్రీకాకుళం/జి.సిగడాం/మెళియాపుట్టి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని అంధవరపు వరం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందీ పండితురాలుగా పనిచేస్తున్న తిమ్మరాజు నీరజ, జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కురమాన అరుణకుమారి, మెళియాపుట్టి మండలం నేలబొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరవల్లి విజయభారతి ఎంపికయ్యారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వీరు అవార్డులను అందుకోనున్నారు.

●తిమ్మరాజు నీరజ 2002-డీఎస్సీకి ఎంపికై ప్రియాగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరారు. 2007లో టీపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తన పోస్టును మెర్జింగ్ చేసుకొని హిందీ పండిట్‌గా విధులు నిర్వహించారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా అంధవరపు వరం ఉన్నత పాఠశాలకు వచ్చారు.

●బూరవల్లి విజయభారతి 2021లో సైన్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. 9వ తరగతి భౌతిక శాస్త్రం టెస్ట్ బుక్‌లో ఎన్నో పాఠ్యాంశాలు రాశారు. ఉపాధ్యాయుల శిక్షణకు అవసరమైన పాఠ్యాంశాలు సైతం తయారీ చేసి అందించారు. నేషనల్ డిజార్టీబుల్ మేనేజ్‌మెంట్ శిక్షణ తీసుకున్నారు. ఈమె తండ్రి బూరవల్లి త్రినాథరావు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. భర్త వెంకటేశ్వరరావు విశాఖలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని బూటుపేట పాఠశాల హెచ్‌ఎం కురమాన అరుణకుమారి తెలిపారు. ఆమెకు ఎంఈవోలు అరసాడ రవి, మొండి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వసతి గృహాలపై పర్యవేక్షణేదీ?

- 81 హాస్టళ్లకు 44 మంది వార్డెన్లే
- ఒక్కొక్కరికీ రెండు హాస్టళ్ల బాధ్యత
- సక్రమంగా అమలు కాని మెనూ
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



ఇచ్ఛాపురం బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)


ప్రభుత్వానికి నివేదించాం

వసతి గృహాలకు వార్డెన్ల కొరత ఉన్నది వాస్తవమే. అయినా ఎక్కడా ఏ ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం. జిల్లాలో 34 హాస్టళ్లకు సంబంధించి వార్డెన్ల కొరత ఉంది. కొందరికి అదనపు బాధ్యత పడుతోంది. ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాలో వార్డెన్ పోస్టుల ఖాళీల వివరాలు డైరెక్టరేట్ ఇచ్చారు. ఏపీపీఎస్ లేదా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్‌సీ) ద్వారా భర్తీ అవుతాయి.

-ఈ.అనూరాధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, శ్రీకాకుళం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వసతి గృహాలకు పూర్తిస్థాయిలో వార్డెన్లు లేరు. సగానికిపైగా హాస్టళ్లను ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో వాటిపై పర్యవేక్షణ లేక విద్యార్థులు గాడి తప్పుతున్నారు. వారికి మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 81 ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 6,500 మంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుతున్నారు. అయితే, 81 హాస్టళ్లకు గాను కేవలం 44 మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. 34 హాస్టళ్లకు సంబంధించి ఇన్‌చార్జిలే ఉండడంతో పరిస్థితి మరింత తీసికట్టుగా మారుతోంది. సగానికిపైగా వార్డెన్లు లేకపోవడంతో ఒక్కొక్కరు రెండు హాస్టళ్ల బాధ్యతలు చూస్తున్నారు. వాస్తవానికి ప్రతి హాస్టల్‌లో వార్డెన్, డిప్యూటీ వార్డెన్, కుక్, సహాయకులు, నైట్ వాచ్‌మన్ ఉండాలి. దగ్గరలో ఉన్న పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తుండాలి. కానీ, వార్డెన్లు అరకొరగా ఉండగా.. మిగతా సిబ్బంది కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తున్నారు. రెండు మూడు హాస్టళ్ల (మిగతా 6వ పేజీలో..)

పోర్టు భూములు అంతేనా?



రాజారాంపురం వద్ద ఉన్న పోర్టు భూములు

- ఆక్రమించి భవనాల నిర్మాణం
- చెరువులు కూడా తవ్వకం
- భూ రికార్డులు లేకపోవడంతో బరితెగింపు
- ఏమీ చేయలేకపోతున్న రెవెన్యూ అధికారులు

పోలాకి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న కళింగపట్నం పోర్టు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ భూములకు సంబంధించి అధికారిక రికార్డులు లేకపోవడంతో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా భూములను ఆక్రమించి భవనాలను నిర్మించడంతో పాటు చేపల చెరువులను తవ్వేస్తున్నారు. ఈ భూములను అధికారులు స్వాధీనం చేసుకుని, పేదల ఇళ్ల కోసం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. స్వాతంత్ర్యానికి ముందు కళింగపట్నం-ఒడిశా పోర్టు ఉండేది. అప్పట్లో ఈ పోర్టు కోసం పోలాకి మండలం పల్లిపేట, రాజారాంపురం, నందిగాం గ్రామాల పరిధిలోని సర్వేనెం 77లో 31.45 ఎకరాల విస్తీర్ణంలో భూములను సేకరించారు. మరికొన్ని గ్రామాల్లో ఉన్న పది ఎకరాలను కలుపుకొని పోర్టుకు సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉండేవని స్థానిక పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో ఓ నౌక రాజారాంపురం తీరం వద్ద ప్రమాదంలో చిక్కుకుని సముద్రంలో మునిగిపోయిందని, ఇప్పటికీ దాని ఆనవాళ్లు ఉన్నాయని అంటున్నారు. అయితే, కాలక్రమంలో పోర్టు కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోవడంతో, వాటి భూములపై ఆక్రమణదారుల కన్ను పడింది. పల్లిపేట, రాజారాంపురంలో ఉన్న పోర్టు భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు (మిగతా 6వ పేజీలో..)

రికార్డులు లేవు

రాజారాంపురం, పల్లిపేట, నందిగాం గ్రామాల పరిధిలో పోర్టు భూములు ఉన్నాయని అనుకోవడమే గానీ వాటికి సంబంధించిన రికార్డులు లేవు. పోర్టు భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై దృష్టిసారించి నోటీసులు జారీ చేస్తాం.

-పి.శ్రీనివాసరావు, తహసీల్దార్, పోలాకి

చేతబడి అనుమానంతో చంపేశారు

- కేశుపురంలో వృద్ధుడి దారుణ హత్య
- కర్రలు, రాళ్లతో మూకుమ్మడిగా దాడిచేసి..
- దారుణానికి ఒడిగట్టింది సమీప బంధువులే
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



రాములు(ఫైల్)

పలాస/పలాసరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశుపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఉంగ రాములు(80) అనే వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో సమీప బంధువులే ఆయనపై కర్రలు, రాళ్లతో దాడి చేసి హతమార్చారు. ప్రత్యక్ష సాక్షులు, కాశీబుగ్గ పోలీసుల వివరాల ప్రకారం.. కేశుపురం గ్రామంలో ఏడాదిలో ఇద్దరు మృతి చెందారు. ఇదే క్రమంలో ఆ గ్రామానికి చెందిన అంబలి తులసీరావు అనే వ్యక్తి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆయన అనారోగ్యానికి, గ్రామంలో ఇద్దరి చావుకు ఉంగ రాములే కారణమని తులసీరావు కుటుంబ సభ్యులు భావించారు. ఎన్ని మందులు వినియోగించినా తులసీరావు ఆరోగ్యం కుదుటపడకపోవడంతో సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి ఓ దాసుడి వద్దకు వెళ్లి విషయం చెప్పారు. దీంతో మంగళవారం రాత్రి 8 గంటలకు తులసీరావు ఇంటికి దాసుడు వచ్చి రెండు గంటల పాటు తాంత్రిక పూజలు నిర్వహించాడు. గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు చేతబడి చేయడం కారణంగానే తులసీరావుకు ఈ పరిస్థితి వచ్చిందని ఆయన చెప్పాడు. దీంతో తులసీరావు కుటుంబీకులంతా వృద్ధుడైన రాములపై అనుమానం పెంచుకున్నారు. పూజలు చేసిన తరువాత దాసుడు తిరుగు ప్రయాణమయ్యాడు. అనంతరం ఒక పథకం ప్రకారం రాత్రి 11-12 గంటల సమయంలో తులసీరావుతో పాటు గ్రామానికి చెందిన అంబలి చంద్రయ్య, సారిపతి రాజ్‌కుమార్, బుడ్డ తేజేశ్వరరావు, బుడ్డ లక్ష్మీకాంత్, అంబలి రాశి, కోనారి సూర్యనారాయణ, అంబలి భీమారావు కర్రలు, రాళ్లు చేతపట్టుకొని రాములు ఇంటికి చేరుకున్నారు. నిద్రపోతున్న రాములును ఇంటి నుంచి బయటకు ఈడ్చుకొచ్చి వారంతా కర్రలతో దాడి చేశారు. ఆయన కింద పడిపోగానే ముఖంపై రాయితో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు భార్య అమ్మన్నమ్మ పక్షవాతంతో బాధపడుతుండడంతో కళ్లెదుటే తన భర్తను హతమార్చుతున్నా కేకలు వేయడం తప్ప ఆమె నిలువరించలేక అక్కడే కుప్పకూలిపోయింది. రాములు, అమ్మన్నమ్మకు కుమారుడు ఉమాపతి, ముగ్గురు కుమార్తెలు ఉంగ అన్నపూర్ణ, అంబటి సరసమ్మ, ఇందిర ఉన్నారు. కుమారుడు ఉమాపతి విశాఖపట్నంలో కూలి పనులు చేసుకుంటున్నాడు. కుమార్తెలు గ్రామంలోనే ఉంటున్నారు. విషయం తెలుసుకొని వారంతా ఇంటికి చేరుకునే సరికి హత్యచేసిన వారంతా పరారయ్యారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ బుధవారం వేకువ జామున పరిశీలించారు. మృతుడి భార్య అమ్మన్నమ్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. హత్యకు వినియోగించిన కర్రలు, రాళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. చేతబడి అనుమానంతో ఈ హత్య చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి శిక్ష పడేలా చేస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో చిల్లంగి అని (మిగతా 6వ పేజీలో..)



రాములు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణ



స్వాధీనం చేసుకున్న కల్తీ మద్యం సీసాలు

కల్తీ మద్యం గుట్టు రట్టు

- అవలంగిలో 212 లీటర్ల స్వాధీనం
- ఇద్దరి అరెస్టు.. మరో ఇద్దరు పరారీ

పాతపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సారవకోట మండలం అవలంగి గ్రామంలో కల్తీ మద్యం తయారీ, అమ్మకాల గుట్టు రట్టు అయింది. ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 212 లీటర్ల కల్తీ మద్యం, 1700 ఖాళీ సీసాలు, మూతలు, లేబుల్స్ పట్టుబడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ వివం లను బుధవారం సాయంత్రం పాతపట్నం ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు అవలంగిలోని దుర్గా వైన్స్ షాప్‌ను తనిఖీ చేయగా నకిలీ మద్యం సీసాలు పట్టుబడ్డాయి. రెండు లీటర్ల సీసాలు-8, రాయల్‌లాన్సర్ 180 ఎంఎల్ బాటిళ్లు-152, ఆఫీసర్స్ చాయిస్ 375 ఎంఎల్-20, ఆఫీసర్ చాయిస్ 180ఎంఎల్-18 మొత్తంగా 54లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు షాపులో పని చేస్తున్న పలాస మండలం కొనసాంగిపురానికి చెందిన తంగుడు మణికంఠ, కోటబొమ్మాళి కి చెందిన ఎస్.సుందరరావును అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. షాపు నిర్వాహకుడు పిట్ట పైడరాజుతో పాటు మరోవ్యక్తి సకలా భక్తుల నీల కంఠం ఈ మద్యం సీసాలను విక్రయించమని చెప్పినట్లు వారు తెలిపారు. అలాగే అవలంగి మోణింగివీధిలో ఓఇంట్లో నకిలీ మద్యం తయారీ జరుగుతున్నట్లు వారుచెప్పడంతో అధికారులు అక్కడకు వెళ్లి తనిఖీ లు చేపట్టారు. ఆ ఇంట్లో రెండు లీటర్ల బాటిళ్లు-50, లీటర్ బాటిళ్లు-20, ఏపీ బ్లాక్ 180ఎంఎల్-98, ఆఫీసర్స్ చాయిస్ 180ఎంఎల్-104, సిల్వర్‌స్టిక్ 180ఎంఎల్ 8, మొత్తం 158లీటర్ల నకిలీ మద్యం పట్టుబడింది. అలాగే, 1700ఖాళీ మద్యం సీసాలు, వివిధ రకాల (మిగతా 6వ పేజీలో..)

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

శ్రీకాకుళం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో పలువురి కూటమి నాయకులకు డైరెక్టర్లుగా అవకాశం లభించింది. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు పమ్మి మోహన్‌జగదీష్‌బాబు, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్‌గా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు మర్రిపాటి పూర్ణచంద్రుడు, నాటక అకాడమీ డైరెక్టర్‌గా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత దక్కత కామేశ్వరావు, ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ మిషన డైరెక్టర్‌గా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు సూరాడ చంద్రమోహన్ నియమితులయ్యారు.

ఇసుకాసురులకు నోటీసులు

- అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం చర్యలు
- 82 నోటీసులు జారీ
- అపరాధ రుసుం చెల్లించాల్సిందేనంటున్న గనులశాఖ



శ్రీకాకుళం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో అడ్డూఅదుపూ లేకుండా జరిగిన ఇసుక తవ్వకాలపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రంలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే భారీగా అక్రమాలు జరిగాయని నిర్ధారించి ఇసుకాసురులకు 82 నోటీసులు జారీచేసింది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లను ఒకే సంస్థకు కట్టబెట్టేసింది. మే 2021 నుంచి డిసెంబరు 2023 వరకు ఇసుక తరలించుకునేందుకు జేపీ సంస్థకు కాంట్రాక్టును కట్టబెట్టింది. ఆ తర్వాత జూన్ 2024 వరకు ఆ సంస్థతో పాటు మరో రెండు సంస్థలకు కూడా కాంట్రాక్టు ఇచ్చింది. అయితే, ఇచ్చిన అనుమతులు కంటే ఎక్కువగా ఆ సంస్థలు ఇసుక తవ్వకాలు చేపట్టి దోచుకున్నాయి. ఆ సంస్థలకు తోడు అప్పటి వైసీపీ కీలక ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు సపరేటు'గా ఇసుక తవ్వుకుని అమ్ముకున్నారు. అనుమతులు ఉన్న వంశధార, నాగావళి రీచ్‌లతో పాటు అనుమతిలేని చోట కూడా ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వుకుపోయి రూ.కోట్లు సంపాదించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారంతా తట్టాబుట్టా సర్దుకున్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం అక్రమార్కులను విడిచిపెట్టలేదు. జిల్లాలో వంశధార, నాగావళి నదులు, ఇసుక రీచ్‌లు, అనధికార ర్యాంపుల నుంచి ఇసుకను ఏవిధంగా తరలించారు.. ఎలా మాయం చేశారు.. ఏమేర నష్టం వాటిల్లిందన్నదీ విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఏపీ శాక్ (ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్)కు ఆదేశించింది. దీంతో ఏపీ శాక్ విచారణ చేపట్టి.. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలోనే అత్యధికంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగిన ట్లు ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీని ఆధారంగా గనులశాఖ చర్యలకు పూనుకుంది. గతంలో జిల్లాలో తవ్వకాలు చేపట్టిన సంస్థలకు నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని, కోట్లాది రూపాయల అపరాధ రుసుం చెల్లించాల్సిందేనని నోటీసుల్లో పేర్కొంది. అయితే, సంస్థల పేరిట మాత్రమే నోటీసులు ఉండటంతో.. అప్పటి ఇసుక అక్రమ తవ్వకాల్లో కీలకంగా వ్యవహరించిన వైసీపీ నాయకులు ఇప్పటికి మనం సేఫ్ అన్నట్లుగా భావిస్తున్నట్లు సమాచారం.

● వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర (మిగతా 8వ పేజీలో..)

పొంగుతున్న గెడ్డలు

- ముంపునకు గురైన పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

6 లో

అవగాహన లేక.. ఆసక్తి చూపక

- గుళికలు ఉన్న యూరియానే వినియోగిస్తున్న రైతులు
- నానో ఎరువుపై కొరవడిన అవగాహన

6 లో

జిల్లా పరిషత్‌కు ఆర్థిక సంఘం నిధులు

శ్రీకాకుళం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులు రాష్ట్ర వ్యాప్తంగా విడుదలయ్యాయి. శ్రీకాకుళం జిల్లా పరిషత్‌కు ఆర్థిక సంఘం నిధులు రూ. 6.24కోట్లు మంజూరయ్యాయి. మండలాలు, పంచాయతీలకు ఎంతమేర నిధులు విడుదలయ్యాయన్నది అధికారులు వెల్లడించలేదు.

పొంగుతున్న గెడ్డలు

● ముంపునకు గురైన పంట పొలాలు

● ఆందోళన చెందుతున్న అన్నదాతలు

జిల్లాలో అల్పపీడన ప్రభావంతో మంగళవారం, బుధవారం కురిసిన వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, లోతుగా ఉండే పొలాల్లోకి నీరు చొరబడుతుండడంతో వరి మొనలు తేలుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపైకి నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పలాస/రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దానగొర, హిమగిరి గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల కొండలపై నుంచి నీరు పొలాల్లోకి చేరుతోంది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఏకధాటిగా కొండల నుంచి నీరు పొలాల్లోకి చేరడంతో గట్లు, వరి పైరు కొట్టుకుపోయాయి. దానగొర, హిమగిరి ప్రాంతాల్లో కొండల దిగువనున్న 25 ఎకరాల పంట నష్టపోయి ఉంటుందని గిరిజన రైతులు చెబుతున్నారు. మహాదేవపురం నుంచి పొత్రియ మీదుగా కొరారింగితాళభద్ర వెళ్లే రహదారి పూర్తిగా జలమయమైంది. రెండడుగుల లోతులో నీరు చేరడంతో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మహాదేవపురం, పొత్రియ,బాపనూరు, సవరరఘునాథపురం, బాలాజీపూరు గ్రామాల రహదారులు జలమయమ య్యాయి. అలాగే పలాస పరిధిలోగల చాకలిచెరువు వద్ద రోడ్డుపై మోకాలు లోతులో నీరు ప్రవహిస్తోంది. దొంగగెడ్డ నిండుగా ప్రవహిస్తుండడంతో సమీప పొలాలు నీటితో నిండిపోయాయి. జగన్నాథ సాగరం చెరువు వద్ద సర్‌ప్లస్ వియర్(పరుపు) మీదుగా నీరు ప్రవ హిస్తోంది. దేశబట్టి చానల్‌లో నిండుగా నీరు ప్రవహిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



హరిపురం: అచ్యుతాపురంవద్ద నీటిలో మునిగిన వరి పొలాలు

నిలిచిపోయిన రాకపోకలు

టెక్కలి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత నౌపడ నుంచి పెద్దరొకళ్ల పల్లి వెళ్లే మార్గంలో వంతెన ముంపునకు గురి కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పెద్దరోకళ్లపల్లి, సీతారాంపల్లి, రామనగరం గ్రామాల ప్రజలు అవస్థలకు గురయ్యారు. బుధవారం కొంత మంది విద్యార్థులను ట్రాక్టర్ల ఇంజన్‌తో రోడ్డు దాటించారు. ఇక్కడ ఏపాటి అదుపు తప్పినా కొట్టుకుపోయే ప్రమాద ముందని పలువురు చెబుతున్నారు.

గోకర్ణపురానికి తగ్గని వరద

మెళియాపుట్టి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేని వర్షాలకు రాధసాగరంలోకి భారీగా నీరుచేరింది. దీంతో కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోకర్ణపురం గ్రామానికి వెళ్లే వంతెన ముంపునకు గురి కావడంతో రెండు రోజులు గా గ్రామం నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకందని గ్రామస్థులు అందోళన చెందుతున్నారు. నిత్యవసర వస్తువుల కోసం కొంత మంది పెదంచల రోడ్డు మీదుగా పలాస వెళ్తున్నారు. వంతెన నీరు లేక పోతే రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న గొప్పిలి వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకువస్తారు. నీటి ప్రవాహం అధికం కావడంతో సుమారు 15 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లి సరుకులు కొనుగోలు చేయాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు.



గోకర్ణపురం వంతెన వద్ద నీటి ప్రవాహం

నిండుకుండల్లా రిజర్వాయర్లు

హరిపురం/మందస, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో పలు రిజర్వాయర్లు నిండుకుండల్లా మారాయి. జీవధార సునాముది, మహేంద్రతనయా నది పొంగిపొర్లుతున్నాయి. చీపి, బెల్లుపటియా వద్ద నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షాలకు పలు కాలువలు గండ్లు పడడంతో వరి పొలాలు నీటిలో నానుతున్నాయి. అలాగే మందస నుంచి చీపి గ్రామానికి వెళ్లే రహదారి గోతులమయమైంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

సండెమ్మగెడ్డ ఉధృతితో నిలిచిన రాకపోకలు

నందిగాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సండెమ్మ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. నందిగాం జాతీయరహదారి నుంచి బెజ్జిపల్లి వెళ్లే సండెమ్మగెడ్డ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో బెజ్జిపల్లి గ్రామస్థుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వారు చిన్నతామరాపల్లి, పెద్దతామరాపల్లి మీదుగా నందిగాం చేరుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. చుట్టుతిరిగి ప్రయాణించడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బెజ్జిపల్లికి చెందిన తమిరె సీతారాం తదితరులు వాపోయారు. అలాగే పెద్దతామరాపల్లి, తూముకొండ రహదారిలో కైజోల సమీపంలో జంగం గెడ్డ నీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కైజోల, కల్లాడ, దిమ్మిడిజోల, దీనబంధుపురం, హర్షబాడ తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా కలిగింది.



నందిగాం: బెజ్జిపల్లి సమీపంలో సండెమ్మగెడ్డ పైనుంచి ప్రవహిస్తున్న నీరు

కొట్టుకుపోయిన డైవర్షన్ రహదారి

నందిగాం: కాపుతెంబూరు జాతీయరహదారి జంక్షన్ నుంచి హుకుంపేట, నౌగాం కూడలికి వెళ్లే రహదారిలోని సింగుపురం సమీపంలో గల వంతెన నిర్మా ణంలో భాగంగా ఏర్పాటుచేసిన డైవర్షన్ రహదారి వరదకు కొట్టు కుపో యింది. దీంతో కొండ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం కలి గింది. అలాగే కవిటిఅగ్రహారం రైల్వే అండర్ పాసేజ్‌లో వర్షం నీరు చేరడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు.

పాఠశాలలోకి చేరిన వర్షం నీరు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలం లోని నగరంపల్లి ప్రాథమిక పాఠశాలలోకి బుధవారం వర్షం నీరుచేరింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడ్డారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు 24 మంది విద్యార్థులు ఉన్నారు. గదుల్లోకి నీరుచేరడంతో ఆయిల్ ఇంజన్ సహాయంతో నీటిని బయటకు తోడారు. భవనాలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఏటా వర్షాకాలంలో వరద నీటితో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు.



నగరంపల్లి పాఠశాలలోకి చేరిన వరదనీరు



పలాసరూరల్: పంట నీటిలో కొట్టుకుపోయిన దృశ్యం



టెక్కలి రూరల్: ముంపునకు గురైన పెద్దరొకళ్లపల్లి వంతెన



పలాస: చాకలిచెరువు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

కల్తీ మద్యం గుట్టు రట్టు

(5వ పేజీ తరువాయి)

నకిలీ మూతలు-1000, బ్యాచ్‌నెంబర్ స్టాంపింగ్ మిషన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో మణికంఠ, సుందరరావును అరెస్టు చేశామని, పైడిరాజు, నీలకంఠం కోసం గాలిస్తున్నామని తెలిపారు. వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. వీరిపై కేసులు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టనున్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ ఏఈఎస్ పి.మురళీధర్, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఎస్‌హెచ్‌వో కోట కృష్ణారావు, ఎస్‌ఐలు జె.సుజాత, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ రూ.2 లక్షలు ఇప్పించండి

● ఎరువులు కోసం ఇస్తే సొంతానికి వాడుకున్నారు

● విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై రైతుల ఫిర్యాదు

నరసన్నపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉర్లాం వీఏవో (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) గొలపల్లి భాస్కర్ తమ నుంచి యూరియా, డీఏపీ కోసం డబ్బులు కట్టించుకుని సొంతానికి వాడుకున్నారని సచివాలయ పరిధిలోని రైతులు బుధవారం రైతు సేవాకేంద్రం వద్ద అధికారులను నిలదీశారు. సమాచారం అందుకున్న ఏడీఏ వెంకటమధు ఉర్లాం సచివాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో రైతుల నుంచి 444 యూరియా బస్తాలకు రూ.280 చొప్పున రూ.1,24,320.. అలాగే 50 డీఏపీ బస్తాలకు రూ.1,370 చొప్పున రూ.68,500 వసూలు చేశారని రైతులు ఫిర్యాదు చేశారు. అలాగే నీటి ఇంజన్ కోసం లింగం రామారావు నుంచి రూ.24,200 కట్టించుకున్నారని, ఈ నగదు కూడా వీఏవో సొంత అవసరాలు వాడుకున్నారని అన్నారు. ఈవిషయంపై వీఏవోను ప్రశ్నించగా డబ్బులు వాడుకున్నట్లు చెప్పారని ఏడీఏ తెలిపారు. ఈ వ్యవహారంపై నివేదిక జిల్లా వ్యవసాయాధికారికి అందజేస్తానన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లు చంద్రమౌళి, సీహెచ్ వామనమూర్తి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



వీఏవో భాస్కర్‌పై ఏడీ వెంకటమధుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బంగారం కొరియర్ అదృశ్యంపై డీఎస్పీ ఆరా

నరసన్నపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నెల 26న విశాఖపట్నంకు సొంత కారులో రూ.2కోట్ల నగదుతో వెళ్లి అదృశ్యమైన బంగారం కొరియర్ పాట్నారు వెలకట పార్వతీశం గుప్తా వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు బుధవారం నరసన్నపేట పోలీసుస్టేషన్ వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుప్తా విశాఖలో దిగి డ్రైవర్‌తో కారును ఇంటికి పంపించడం.. రెండు రోజులు తరువాత ఆయన మొబైల్ ఆర్టీసీ బస్సులో పడేయడం.. ఆ ఫోన్‌కు కుటంబ సభ్యులు కాల్ చేస్తే ఆర్టీసీ బస్సులో దొరికిందని ఓ ప్యాసింజర్ ఇవ్వడం.. పథకం ప్రకారమే జరిగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ఇంతకీ ఆయన రూ.2కోట్లు తీసుకువెళ్లాడా? తీసుకువెళ్తే బంగారం వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా ఉండటానికి కారణాలు ఏంటి? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అవగాహన లేక.. ఆసక్తి చూపక

● గుళికలు ఉన్న యూరియానే వినియోగిస్తున్న రైతులు

● నానో ఎరువుపై కొరవడిన అవగాహన



నానో యూరియా పిచికారీ చేస్తున్న రైతు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాతలకు అవగాహన లేకపోవడంతో నానో యూరియా, డీఏపీ వినియోగానికి ఆసక్తి చూపడం లేదు. దశాబ్దాల తరబడి పలు కంపెనీలు తయారుచేసే గుళికల రకంలో ఉండే యూరియా, డీఏపీ వినియోగానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అన్నదాతపై భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నానో ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. వీటిపై రైతులకు పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం, అధికారులు సైతం సదస్సులు నిర్వహించి వివరించకపోవడంతో వినియోగానికి వెనుకడుగు వేస్తున్నారు. నానో ఎరువు స్ప్రేచేసి సులభంగా చల్లడంతోపాటు ధర కూడా తక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు సైతం చెబుతున్నారు. అయితే రైతులు ఎక్కువగా సాధారణంగా ఉండే యూరియా, డీఏపీనే వినియోగిస్తున్నారు. వీటి ధర ఎక్కువ కావడంతోపాటు సమయానికి నీటి తడులు ఎక్కువైనా, తక్కువైనా వృథా అవుతుంది. ఈ స్థితి నుంచి రైతులు ఉపశమనం పొందేందుకు నానో ఎరువులు అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఖర్చులు తగ్గించుకోవచ్చు..

రైతులపై ఆర్థికభారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నానో ఎరువులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధానంగా రవాణా చార్జీలు తగ్గించడంతోపాటు రహదారి సౌకర్యంలేని గ్రామీణ ప్రాంతాలకు సులువుగా తరలించేందుకు, మోయాల్సిన అవసరం లేకుండా ఉండేందుకు నానో ఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో బస్తా యూరియాను రూ. 267కే విక్రయిస్తోంది. బహిరంగ మార్కెట్లో రూ. 300లు నుంచి రూ. 370 వరకు అమ్ముతున్నారు. ఇంటికి తీసుకురావడానికి అధనంగా రవాణాఖర్చు అవుతుంది. అదే నానో యూరియా 500 మిల్లీలీటర్ల సీసా ధర మార్కెట్లో రూ.225 నుంచి 249కే లభిస్తుంది. ఎకరాకు 550 మిల్లీలీటర్లు సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం డీఏపీ బస్తాను రూ. 1350కి విక్రయిస్తుండగా మార్కెట్లో రూ. 1450 నుంచి 1500ల వరకు విక్రయిస్తున్నారు. అదే నానో డీఏపీ లీటర్ రూ. 595కి దొరుకుతుంది. సాధారణ ఎరువు అయితే బస్తాలు మోయాల్సిఉంది. అదే నానో ఎరువులు సీసాల రూపంలో ఉండడంతో సులభంగా తీసుకువెళ్లవచ్చని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

నానో ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నామని కోటబొమ్మాళి మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. సాధారణ యూరియా, డీఏపీలు ఎలా పని చేస్తాయో నానో ఎరువులు అటువంటి ప్రయోజనాలే ఇస్తాయని చెప్పారు.





మేఘాలు మిలమిల

అరసవల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నాగావళి నదిలో నీరు చేరి నిండుకుండలా కనిపిస్తోంది. నీరు ఉధృతంగా ప్రవహిస్తూ కనుచూపు మేర ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. దీనికి తోడు మంగళవారం సాయంత్రం గలగల పారే నదిపై మేఘాలు మిలమిలా మెరుస్తూ చూపరులకు కనువిందు చేశాయి. ఈ అపురూప దృశ్యాన్ని కొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించి.. మురిసిపోయారు.

← శ్రీకాకుళం పట్టణంపై వెండి మబ్బులు

వసతిగృహాలపై పర్యవేక్షణేదీ?

(5వ పేజీ తరువాయి)

బాధ్యతలను అప్పగించడంతో వార్డెన్లు పూర్తి స్థాయిలో సమయాన్ని కేటాయించ లేకపోతున్నారు. దీంతో మెనూ అమలు, హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆహారం పరిమాణం, నాణ్యత తగ్గుతోంది. విద్యార్థులకు వసతి కూడా సక్రమంగా అందడంలేదు. కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత 20 ఏళ్లుగా వార్డెన్‌ల నియామకాలు జరగడం లేదు. చాలామంది పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త వారు రాలేదు. దీంతో ఏడాదికేడాది వార్డెన్ పోస్టులు ఖాళీ అవుతున్నాయి.

పెరగని డైట్ చార్జీలు..

గత ఐదేళ్లుగా విద్యార్థుల డైట్ చార్జీలు పెరగడం లేదు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడంతో వసతిగృహ అధికారులు మెనూలో కోత విధిస్తున్నారు. వారానికి ఆరు రోజులు పెట్టాల్సిన కోడిగుడ్డను రెండు రోజులే పెడుతున్నారు. చికెన్ వారానికి ఒక రోజుకే పరిమితం చేస్తున్నారు. కూరల్లో నాణ్యత కొరవడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో చివరి సారిగా మెస్ చార్జీలు పెరిగాయి. అప్పట్లో ఉన్న నిత్యావసర ధరలకు ఇప్పటి ధరలకు 100 నుంచి 150 శాతం తేడా ఉంది. ప్రభుత్వం చెల్లించే ధరకు బయట మార్కెట్‌లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలుపోవడం లేదు. దీంతో మెనూ అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెస్ చార్జీలను పెంచాలని కోరుతున్నారు.

పోర్టు భూములు అంతేనా?

(5వ తరువాయి)

చేపడుతున్నారు. కొందరు ఆ భూముల్లో చెరువులను తవ్వి ఉపాధి హామీ పనులు చేయించుకుని లబ్ధిపొందుతున్నారు. ఈ భూములకు సంబంధించి అధికారికంగా దస్త్రాలు లేవని, అయినా వాటిని ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయని రెవెన్యూ సిబ్బంది హెచ్చరిస్తున్నా ఆక్రమణదారులు వెనక్కి తగ్గడం లేదు. జిల్లాలో చేపడుతున్న మూలపేట పోర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు పోలాకి మండల పరిధిలోని పోర్టు భూములపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విన్నవిస్తున్నారు.

పోర్టుభూమి నాకు అప్పగించాలి

రాజారాంపురం, నందిగాం ప్రాంతంలో ఉన్న పోర్టు భూమిని పోర్టు అధికారులు తనకు రాసిచ్చారని స్థానిక వ్యక్తి గనగళ్ల రాంబాబు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. ఆ భూమిని తనకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను కోరాడు. ఈ మేరకు పోర్టు అధికారులు ఇచ్చిన పత్రాలను రెవెన్యూ సిబ్బందికి చూపించాడు. అయితే, తమకు పోర్టుభూమి అప్పగించే అధికారం లేదని రెవెన్యూ సిబ్బంది ఆయనకు చెప్పారు.

చేతబడి అనుమానంతో చంపేశారు

(5వ పేజీ తరువాయి)

ప్రచారం చేసి అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాసుడు వచ్చాడంటే ఘర్షణలే..

కేశుపురంలో ఒక సామాజిక వర్గ ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటున్నారు. వీరంతా మూఢనమ్మకాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారని ఆ వర్గానికి చెందిన వారే చెబుతున్నారు. చిన్న జ్వరం వచ్చినా బోరుభద్రకు దాసుడుని తీసుకువచ్చి పూజలు చేయిస్తుంటారు. ఆయన ఎప్పుడు వచ్చి వెళ్లినా గ్రామంలో చిన్నచిన్న ఘర్షణలు జరుగుతుంటాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రాములు క్షుద్ర పూజలు చేస్తూ అందరికీ చేతబడులు చేస్తుంటాడని గ్రామానికి చెందిన కొంత మందిలో అనుమానాలు ఉన్నాయి. ఈ క్రమంలో తులసీరావు అనారోగ్యానికి గురికావడానికి చేతబడే కారణమని భావించి ఆయన కుటుంబీకులు రాములును చంపేశారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టింది రాములు రక్తసంబంధీకులే కావడం విశేషం.



రోదిస్తున్న భార్య, కుమార్తెలు

నిర్లక్ష్యం

గార-పోలాకి మండలం వనితమండలం మధ్య వంశధార నదిపై నిర్మిస్తున్న వంతెనకు ఉపయోగించే ఇనుప గజాలు, ఇనుప సామగ్రి తుప్పు పట్టి పాడవుతున్నాయి. వంతెన నిర్మాణంలో జాప్యం కావడంతో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

-గార రూరల్



వంతెన నిర్మాణ ప్రాంతంలో తుప్పుపట్టిపోతున్న ఇనుప సామగ్రి

అంధకారం

పట్టణంలోని రైల్వే అండర్ టన్నెల్‌లో విద్యుత్ దీపాలు వెలగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వర్షపు నీరు నిలిచిపోవడం, మరోపక్క లైట్లు వెలగక పోవడంతో నరక యాతన పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అండర్ టన్నెల్‌లో చీకటిగా ఉన్న దృశ్యం

-ఆమదాలవలస

ప్రమాదకరం

గార ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే గేటు వద్ద కల్వర్టుపై ఉన్న ఇనుప రాడ్లు, సిమెంట్ ఊడిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తక్షణం సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

-గార



పీహెచ్‌సీ గేటు వద్ద కల్వర్టుపై దుస్థితి..

కూలితే అంతే

శిలగాం సింగువలసలో నాగళ్ల చెరువు పక్కన వ్యవసాయ విద్యుత్ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దిమ్మ బీటలు వారి ఒకవైపు ఒరిగిపోయి ఉంది. ఒకవేళకూలిపోతే సమీపంలో ఉన్న చెరువులో స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చిన వారు ఎటు వంటి ప్రమాదానికి గురువుతారోనని భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే తగు చర్యలు తీసుకుని కొత్తదిమ్మను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



బీటలు వారి ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ

-శ్రీకాకుళం రూరల్

సేవా కార్యక్రమాలు అభినందనీయం: ఎన్ఈఆర్

లావేరు, సెప్టెం బరు 3 (ఆంధ్ర జ్యోతి): పరిశ్రమలు సీఎస్ఆర్‌లో భాగం గా ప్రజలకు అవసర మైన సేవా కార్యక్ర మాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. తాళ్లవలసలో అర బిందో పరిశ్రమ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక పరిశ్రమలు ప్రజలకు అవసరమైన ఇటువంటి పనులు చేపట్టడం శుభపరి ణామమన్నారు. మినరల్ వాటర్‌ను వృథా చేయకుండా విని యోగించుకోవాలని కోరారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ విభాగంలో జిల్లాలో 3వ ర్యాంకు సాధిం చిన పిసిని దేవీవర ప్రసాద్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, అరబిందో పరిశ్రమ హెచ్ ఆర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్య నారాయణ స్వామి వారి కల్యా ణం బుధవారం ఘనంగా జరిగింది. భాద్రపద శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలు, మంగళ వాయి ద్యాల నడుమ స్వామి కల్యాణం నిర్వహించారు. కార్య క్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప శర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ, నగేష్ శర్మ పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు శుభరాట

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పకీరుపేట సమీపంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వ హణకు గాను బుధ వారం శుభరాట వేశారు. వేద పండితుడు ఫణి శర్మ ఆధ్వర్యంలో మనోజ్ శర్మ స్థాని కులతో పూజలు చేయించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కంచిలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) అర్జునాపురం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి దశహారతులు

శ్రీకాకుళం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మొండేటివారి వీధిలోని లక్ష్మీ గణపతి ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా బుధవారం అష్టోత్తర సహిత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తికి గ్రామ ప్రదక్షిణ చేయించారు. దశహారతులు, విశేష అర్చనలు చేశారు. మంగువారితోటలోని పంచముఖేశ్వర ఆలయంలో వినాయక మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల నిర్వహించారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం

కవిటి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కవిటిలోని గణనాథుని నిమజ్జన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. హాస్పటల్‌వీధి, బెహరా వీధి, కొత్త కాలనీ, కవిటి-కొత్తూరులో నెలకొల్పిన వినా యకుని విగ్రహాలను గ్రామంలో ఊరేగించి రంగాలగెడ్డలో నిమజ్జనం చేశారు. కవిటి హాస్పటల్ వీధిలో గణేష్ లడ్డూను ఎస్.అర్జునరావు రూ.45,501లకు దక్కించుకున్నారు.

మహా దీపారాధన

లావేరు, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): అప్పాపురం కోదండ రామా లయం వద్ద గణపతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దీపారాధన చేప ట్టారు. అలాగే తామా డలో దీపారాధన ఏర్పాటు చేశారు. గణపతి మండపాల్లో ప్రత్యేక పూ జలు, భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



దీపాలతో గణనాథుడు

లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలి

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలికలు లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్య దర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక బాలికల పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, ప్రిన్సిపాల్ పి.సుజాత పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు విద్యార్థులు, యువత సహకరించాలని శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆదివారంపేటలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, నారీ సంకల్పంపై అవగాహన కలిగించారు.

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో పరివర్తన ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి, జగన్నాథ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు సామూహిక పారాయణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల నియామకం

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు సీఐలను నియమిస్తూ బుధవారం విశాఖ రేంజి డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత నెల 31న దిశ పోలీస్ స్టేషన్ సీఐ త్రినేత్రి పదవీ విరమణ పొందగా ఆమె స్థానంలో పాతపట్నం సీఐ వానపల్లి రామారావును నియమించారు. అలాగే పాతపట్నం సీఐగా విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న ఎన్.సన్యాసి నాయుడును నియమించినట్లు డీఐజీ గోపినాథ్ జెట్టీ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత

అరసవల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ కార్యకర్త రమణమూర్తి సతీమణి పుష్పలత కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుండగా ఆమెకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేశారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ పెన్నిధిగా నిలుస్తుందన్నారు.

ఓట్ అధికారి యాత్ర విజయవంతం

అరసవల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికారి యాత్ర విజయవంతమైందని, ఇది ప్రజాస్వామ్యంలో సువర్ణాధ్యాయమని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డా. పూడి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఓట్ల చోరీ ఉదంతాన్ని దేశ ప్రజలకు తెలియజేయడంలో, న్యాయ వ్యవస్థ ముందుంచడంలో ఈ యాత్ర దోహదపడిందన్నారు. నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లో పీటీఆర్ ఏర్పాటు

గార, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ సబ్ స్టేషన్‌లో పాత పీటీఆర్ స్థానంలో బుధ వారం కొత్త ఐఎంవీ పీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చిన ఈపీటీఆర్ రెండు రోజులుగా ఏర్పాటుకు ప్రయత్నించినా వర్షాల వల్ల అంతరాయం కలిగింది. బుధవారం వాతావరణం అనుకూలించడంతో ఏర్పాటు చేశారు.

లక్ష్యాలతో విజయం సాధ్యం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలతో కూడిన విద్య అభ్యసించడంతోనే విజయాలు సాధ్యమని ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ గంపా నాగేశ్వరరావు అన్నారు. శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కమ్ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులు బెట్టింగ్స్, డ్రగ్స్‌కు బానిసై జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గైన కాలజిస్ట్ దానేటి శ్రీధర్, సుగుణాకరరావు, యాజమాన్య ప్రతినిధులు వీవీఎం సాయినాథ్ రెడ్డి, పి.దుర్గాప్రసాద్ రాజు, దుప్పల వెంకటరావు, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, జీటీ చంద్రశేఖర్, విభాగాధిపతి కె.మధుకుమార్ పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

రణస్థలం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎరువులు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్ర యించినా చట్టపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం నారువా గ్రామంలో వెంకట సత్యనారాయణ కిరాణా దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ.45,011 విలువైన 14 బస్తాల యూరియా, 11 బస్తాల కాంప్లెక్స్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎరువులను వేర్వేరు దుకాణాల నుంచి కొనుగోలు చేసి వెంకట సత్యనారాయణ ఇంట్లో నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యాపారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, ఏవో భాస్కరరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు పాటుపడాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. నగరంలోని చారిత్రక ప్రసిద్ధి కలిగిన ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆలయాల కమిటీల నియామకం పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. హిందూ దేవాలయాలు సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాలక మండలి అధ్యక్షుడిగా పాండ్రంకి దేవేంద్రనాయుడు, సభ్యులుగా బెహరా శ్రీదేవి, కోరాడ రమేష్, కటారి అరుణ, పొదిలాపు అమరవాణి, కొండ్ర అరుణలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈవో మునగవలస సుకన్య, ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీరామమూర్తి శర్మ, టీడీపీ నాయకులు పాండ్రంకి శంకర్, నాగేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

దుర్గాదేవి ఆలయంలో..

బ్రిడ్జిరోడ్డు సమీపంలోని దుర్గామాత ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా మచ్చ బుచ్చిబాబు, సభ్యులుగా సకలాభక్తుల శ్రీనివాస్, ఎ.మల్లికార్జున, శివకోటి సరళ, మచ్చ జయ దుర్గ, పీవీ అప్పలసూర్యనారాయణ, అలసంగి తేజేశ్వరి ప్రమాణం చేశారు. వీరిని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. కార్యక్రమంలో ఈవో సన్యాసిరావు, బీజేపీ ప్రతినిధులు డబ్బీరు సోమేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి, సరళ, రంగలక్ష్మి, సురేష్ సింగ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

సోంపేట రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని, దీనికి సముద్రపు నాచు పెంపకాన్ని చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. సీ ఫుడ్ ఉత్పత్తులు, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు గాను జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో మూలపొలం గ్రామంలో జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో బుధవారం పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సముద్రపు నాచు పెంపకంపై మహిళలకు అవ గాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

డిజిటల్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు

గార రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వమరవల్లి సచివాలయంలో గత కొద్ది రోజులుగా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఇక్కడ పనిచేసిన డిజిటల్ అసిస్టెంట్ వినూష ఇటీవల బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వచ్చిన సుధీర్ రెండు నెలల కిందట పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి వివిధ పనులపై వస్తున్నప్పటికీ పనులు జరగడం లేదని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రెవెన్యూ శాఖకు చెందిన మ్యూటేషన్లు, పింఛన్లు, సదరం దరఖాస్తులు తదితర సేవలు నిలిచిపోయాయి. దీంతో పనులు మానుకుని సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళింగపట్నం, గార మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రఘును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడం వాస్తవమని, రెగ్యులర్ పోస్టు భర్తీ డీపీవో అధీనంలో ఉంటుందన్నారు. పస్తుతం తోణంగి సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు. అయితే ఆయన సదరం వెరిఫికేషన్ నిమిత్తం రిమ్స్‌కు వెళుతున్నారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శృంగార, వైరాగ్య కావ్యం 'కవికర్ణ రసాయనం'

శ్రీకాకుళం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శృంగార, వైరాగ్య కావ్యం 'కవికర్ణ రసాయనం' అని డాక్టర్ బారువ కోమలరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న సాహిత్య గణపతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవికర్ణ శ్రీకృష్ణదేవరాయలు కాలానికి చెందిన వాడన్నారు. ఆయన రచించిన కావ్యంలో అనేక వర్ణనలు ఉన్నాయన్నారు. ఇందులో శృంగారంతో పాటు వైరాగ్యం, భక్తి తదితర అంశాలు ఉన్నా యన్నారు. అనంతరం వక్తను మందిరం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జంధ్యాల శరత్ బాబు, మురళీకృష్ణ, సత్యనారాయణ, నారాయణ మూర్తి, నిష్టల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



డా.కోమలరావును సత్కరిస్తున్న మందిరం ప్రతినిధులు

9న సబ్జెక్టు కాంట్రాక్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలకు చెందిన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ పి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ, ఎంసీఏ కోరుల్లో ఆరు, ఈసీఈలో నాలుగు, మెకానికల్‌లో రెండు, సివిల్‌లో రెండు, మైక్రోబయాలజీలో ఒక పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నేరుగా హాజరు కావచ్చన్నారు. వివరాలకు క్యాంపస్‌లో కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వైసీపీ నేతలది శవ రాజకీయం

పొందూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఒకే పార్టీలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదం, కుటుంబ కలహాలతో వైసీపీ వార్డు సభ్యుడు ఆత్మహత్యకు పాల్పడితే.. ఈ నెపాన్ని కూటమి నేతలపై నెట్టి శవరాజకీయం చేయడం వైసీపీ నేతలకు తగదని ఏఎంసీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ అన్నెపు రాము అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఎం. వరాహనరసింహులు కుటుంబ కలహాలు, స్థలవివాదంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అయితే తన కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవి పేర్కొనడం దారుణమన్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసమే నెపాన్ని కూటమి నాయకులపై రుద్దుతున్నారన్నారు. నాయకులు బలగ శంకర భాస్కర్, బాడాన గిరి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సరుబుజ్జిలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి విద్యుత్ స్టేషన్ రొట్టవలస ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల నిర్వహణకు గాను శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి. యోగేశ్వరరావు తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరుబుజ్జిలి నుంచి చిగురువలస, మర్రిపాడు, కొత్తకోట, షలంత్రి, రొట్టవలస, పెద్దపాలెం, పురుషోత్తపురం, చెవ్వాకులపేట, వెంకటాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండద న్నారు.

బాధ్యతల స్వీకరణ

పొందూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా పొందూరు సింహాచలాన్ని నియమించారు. ఈ మేరకు జడ్పీసీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోగా పని చేసిన ఎం.మన్మథరావు ఇటీవల పదవీ విరమణ చేశారు. సింహాచలం ఇక్కడే ఈవో పీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జి.సిగడాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిద్దాం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ఎర్నేన శ్రీరామూర్తి తండ్రి, మాజీ సర్పంచ్ గోపాలనాయుడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు తదితరులున్నారు.

ప్రదర్శనకు వెళ్లి.. ప్రాణాలు కోల్పోయి

తూర్పుగోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదంలో అజ్జరాం యువకుడి మృతి



లక్ష్మణరావు(ఫైల్)

ఎచ్చెర్ల/దేవరపల్లి, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలోని అజ్జరాం గ్రామానికి చెందిన జీరు లక్ష్మణరావు (29) తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి మండలంలోని కృష్ణంపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నెల్లూరులో జరిగే ప్రదర్శనకు వెళ్లి మృత్యువు పాలవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. డిప్లమో వరకు చదివిన లక్ష్మణరావు డ్యాన్స్‌పై మక్కువతో స్నేహితులతో కలిసి ఎంఎండీఎస్ ఈవెంట్ పేరుతో వివిధ కార్యక్రమాలకు డ్యాన్స్ ప్రదర్శనలు ఇస్తున్నాడు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరులో జరిగే ప్రదర్శనలకు బయలుదేరి వెళ్లాడు.ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా కృష్ణంపాలెం జాతీయరహదారిపై కంటైనర్ లారీ, వీరు ప్రయణిస్తున్న వ్యాన్ ఢీకొన్నాయి. వ్యాన్‌ను నడుపుతున్న జీరు లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ బృందంలో ఇద్దరు మహిళా డ్యాన్సర్లు, మిగిలినవారు గాయాలతో బయటపడ్డారు. స్వల్పగాయాలైన శ్రావణ్, కరిష్మా, హరిని 108 వాహనంలో గోపాలపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. లక్ష్మణరావు తండ్రి అసిరప్పడు ఆటో డ్రైవర్ కాగా, తల్లి గృహిణి. చేతికి అందొచ్చిన ఒక్కకొడుకు మృతి చెందడంతోవారు కన్నీరుమున్నీరవుతున్నారు. లక్ష్మణరావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి మృతి

రణస్థలం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిషిని గ్రామానికి చెందిన వై.రామినాయుడు (75)గడ్డి మందుతాగి బుధవారం మృతి చెందినట్లు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. కడుపు నొప్పి తాళలేక వృద్ధుడు గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ఆరుగురి అరెస్ట్

శ్రీకాకుళంక్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సురేష్ అనే యువకుడిపై దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులను బుధవారం అరెస్టుచేసినట్టు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు తెలిపారు. డబ్బులు బాకీ విషయంలో నవభారత్ జంక్షన్ వద్ద అతడిని సదరు వ్యక్తులు గత నెల26న అర్ధరాత్రి డాబాలోఅడిగారు.సదరు సురేష్‌ను అక్కడి నుంచి కారులో విశాఖ-బి కాలనీలోని లోకేష్ ఇంటికి తీసుకువెళ్లి అక్కడ దాడి చేశారు. ఈనేపథ్యంలో బాధితుడి ఫిర్యాదుమేరకు కేసుపోలీసులు నమోదు చేశారు. దాడి సమయంలో వినియోగించిన ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు పేర్కొన్నారు.

కొట్లాటలో ఇరువర్గాలపై కేసు నమోదు

ఆమదాలవలస, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో బుధవారం జరిగిన కొట్లాటలో ఇరువర్గాలపై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు.. గ్రామంలోని రెండు సామాజిక వర్గాల మధ్యకొంతకాలం నుంచి వివాదాలున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం కొట్లాట జరిగింది. ఈకొట్లాటలో ఓ వర్గంలో నలుగురు మరో వర్గంలో ఆరుగురు గాయపడినట్టు ఎస్ఐ తెలిపారు. వీరిలో అరసవల్లి హరమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలుకావడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. ఒక వర్గానికి చెందిన బురద రాజులమ్మ, మరో సామాజిక వర్గానికి చెందిన దవళ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువైపులా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్‌షాపులు నిర్వహించవద్దని తీర్మానం

టెక్కలిరూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):మద్యానికి దూరంగా ఉంటేనే గ్రామంఅభివృద్ధి చెందుతుందని నర్సింగపల్లి గ్రామస్థులు తెలిపారు. దీంతో బెల్ట్‌షాపులు నిర్వహించరాదని బుధవారం గ్రామస్థులు నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. ఇదివరకే గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా అమ్ముతున్నవారికి జరిమానా విధించి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.మద్యం తాగడంతో పలువురు మృత్యవాతపడుతుండడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామస్థులంతా మద్యం అమ్ముకూడదని తీర్మానించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన



డిగ్రీ కళాశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తూరులో డిగ్రీకళాశాల ఏర్పాటుకు బుధవారం అధికారులు, టీడీపీ నాయకులు స్థలాన్ని పరిశీలించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాతపట్నం ఎమ్మెల్యే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని విన్నవించారు.దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు మాధవరావు, అరుణకుమార్, లక్ష్మీనారాయణ, గాంధీ, రాజారావు, తిరుపతిరావు, రాము, దశరధరావు, అధికారులు స్థలాన్ని పరిశీలించారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

మందస, సెప్టెంబరు3(ఆంధ్ర జ్యోతి): విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ సాధికారిత అధికారి విమల హెచ్చరించారు. బుధవారం మందస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూలిపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. మూలిపాడు అంగన్‌వాడీ కేంద్రంపై వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రం నుంచి వస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం మందస-5,7 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి మణి, సీడీపీవో పి.అరుణ, సూపర్‌వైజరు సీహెచ్‌వీ రామలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

నరసన్నపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు టీడీపీ అభ్యున్నతికి కృషి చేయాలని కురాకుల, పొందర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులకు ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి సూచించారు. బుధవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవనంలో కురాకులు, పొందర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా దామోదర నర్సింహులు పదవీప్రమాణ స్వీకరం చేశారు. కార్యక్రమంలో బగ్గు సునీల్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు, కూటమి నాయకులు అడపా చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

ఇసుకాసురులకు నోటీసులు

(5వ పేజీ తరువాయి)

వ్యాప్తంగా జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై ఓ వ్యక్తి ఆధారాలతో సహా ఇటీవల సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. ఈ విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో 6,500 హెక్టార్లలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగ్గా..శ్రీకాకుళం జిల్లాలో 489.850 హెక్టార్లలో తవ్వకుపోయినట్లు అఫిడవిట్‌లో ఆ వ్యక్తి చేర్చాడు. ఇందుకు సంబంధించి 2021-24 మధ్య కాలంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలను నిర్ధారించేందుకు 'గూగుల్ ఎర్త్‌ప్రో' చిత్రాలను కూడా సేకరించి సుప్రీం ముందు ఉంచాడు.

వంటశాల లేక.. అగచాట్లు తప్పక

● ప్రహరీ కూలిపోవడంతో భయాందోళన చెందుతున్న విద్యార్థులు ● ఇదీ గంగువాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరిస్థితి



పాఠశాల ప్రహరీ కూలిపోయిన దృశ్యం

పాతపట్నం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగువాడ పాఠశాలలో సమస్యలు తిష్ఠవేశాయి. ప్రధానంగా వంటశాల లేకపోవడంతో మధ్యాహ్నం భోజనం నిర్వహణకు అగచాట్లు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తడిచిపోయి వంటలు చేయాల్సివస్తోంది. వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరుచేసినా బిల్లులు కాక తదితర కారణాల వల్ల పనులు పూర్తికాలేదు. దీంతో ప్రస్తుతం విద్యార్థులు అరకొర వసతుల మధ్య చదువులు సాగించాల్సి వస్తోంది.ఇక్కడ 120మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.గ్రామానికి ఆనుకొని పాఠశాలనిర్వహిస్తున్నారు. ప్రహరీ కూలిపోవడంతో ఆవరణలోకి పశువులు రావడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.ఈపాఠశాల ప్రాంగణంలో మండల పరిషత్ పాఠశాల కూడా నిర్వహిస్తున్నారు. రెండు ఒకే చోట నిర్వహించడం వల్ల వసతి సమస్య కూడా వేధిస్తోంది. పాఠశాల మైదానం నిర్వహణ లోపం వల్ల చిత్తడిగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంకావడంతోపాటు గడ్డి పెరగడంతో ఆటలు ఆడేందుకు అనువుగా లేదని విద్యార్థుల వాపోతున్నారు. దీంతో విద్యార్థులు వ్యాయామానికి దూరమవుతున్నారు.

అర్జీలు పరిష్కరించండి

● లక్ష్యాలను అమలు చేయాలి: కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్

టెక్కలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్ సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది లక్ష్యాలను అమలు చేయాల్సిందేనని స్పష్టంచేశారు. బుధవారం రాత్రి టెక్కలిలో పలాస, టెక్కలి డివిజన్ రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ట్రైనీ సహాయ కలెక్టర్ దొనక పృధ్వీరాజ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు ఎం.కృష్ణమూర్తి, జి.వెంకటేష్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, స్పెషల్ ఆఫీసర్ అనురాధ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆరోగ్య సేవలు విస్తరించాలి

ఎన్టీఆర్ ఆరోగ్య సేవలు మరింత విస్తరించాలని కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్ కోరారు. బుధవారం టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో ఓపీతో పాటు రక్తనిధి కేంద్రం, సీటీస్కాన్, మలేరియా, డెంటల్ విభాగాలు పరిశీలించారు.ల్యాబ్ పరీక్షలపై ఆరాతీశారు. రోగుల అవగాహన కోసం గోడలపై అతికించిన పోస్టర్లు తొలగించి శాశ్వత సూచనబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.అనంతరం బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని సందర్శించి ఫిజియోథెరఫీ,ఆక్యుపేషనల్ థెరఫీ, వినికిడిపరికరాలు, ఈసీజీ విభాగాలు పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో అవసరమైన మొక్కలను పెంచాలని ఆదేశించారు.రూ.40లక్షలతో నిర్మిస్తున్న సోలార్‌విద్యుత్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఆసుపత్రిలో అవసరాలు తెలియజేయాలని సూపరింటెండెంట్ సూర్యారావుకు ఆదేశించారు.ఆయనతోపాటు ట్రైనీకలెక్టర్ పృధ్వీరాజ్, డీఎం హెచ్‌వో అనిత,డీసీహెచ్ కళ్యాణ్‌బాబు, ఎన్టీఆర్ సేవల కోఆర్డినేటర్ ప్రకాష్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇంటి పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్ తెలిపారు. టెక్కలి భైరివీధిలోని కాలువలను తనిఖీ చేశారు.ఇళ్లముందు కాలువల్లో మురుగు, చెత్తఉండడాన్ని గమనించి అక్కడున్న మహిళలకు పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేస్తున్నారా, లేదా, చెత్తసేకరణ ఏరకంగా జరుగుతుందని ఆరాతీశారు.పారిశుధ్యకార్మికులు చెత్తసేకరణకు ఏ సమయానికి వస్తారో తెలియడం లేదని మహిళలు తెలిపారు. వీధి ప్రజలకు చెత్త సేకరణ సమయాన్ని తెలియజేయాలని కార్యదర్శి ఏవీ శ్రీనివాస్‌కు కలెక్టర్‌ఆదేశించారు.ఆప్రాంతంలో ఐదంతస్థుల భవననిర్మాణం జరుగుతుండడంతో వాటికి అనుమతులు ఉన్నాయా, లేదా తెలుసుకోవాలని పంచాయతీ యంత్రాంగానికి ఆదేశించారు. ఆయనతో పాటు ట్రైనీ కలెక్టర్ పృధ్వీరాజ్, డీపీవో భారతీసౌజన్య, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఎల్‌పీవో ఐవీ రమణ, ఈవోపీఆర్డీ గోపీబాల ఉన్నారు.

నామినేషన్లు వేసి.. పోలింగ్ నిర్వహించి

● సారవకోట ఉన్నత పాఠశాలలో బ్యాలెట్ పద్ధతిలో ఎస్‌పీఎల్ ఎన్నిక



బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేస్తున్న విద్యార్థి

జలుమూరు (సారవకోట), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సారవకోట ఉన్నతపాఠశాలలో బుధవారం హెచ్‌ఎం రామకృష్ణారావు ఆధ్వర్యంలో పార్లమెంటరీ పద్ధతిలో ఎస్‌పీఎల్ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్లు అనంతరం పోటీల్లో ముగ్గురు అభ్యర్థులు నిలిచారు. అనంతరం పోలింగ్‌ను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు.ఈ మేరకు మొత్తం ఓట్లు 239 పోల్ కాగా దేవాది హేమసుందర్ 120 ఓట్లు మెజారిటీతో గెలిపొందినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా ఎంఈవో ఎంవీ రమణ, ఎంఈవో-2 భూలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏవో గైర్హాజరుపై నిలదీత

● ఎరువుల కొరతపై సంతబొమ్మాళి మండల సమావేశంలో వాడివేడి చర్చ

సంతబొమ్మాళి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు దొరక్క ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయఅధికారులను సంతబొమ్మాళి మండల సమావేశంలో సభ్యులు నిలదీశారు. బుధవారం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఎరువుల కొరతపై వాడివేడి చర్చజరిగింది. తొలుత వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయాధికారి సమావేశానికి గైర్హాజరుకావడంపై సభ్యులు ఎంపీడీవోను నిలదీశారు.దీంతో తనకు ఏవో ఎటువంటిసమాచారం ఇవ్వలేదని గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తానని ఎంపీడీవో జయంత్ ప్రసాద్ తెలిపారు. సచివాలయాలకు వచ్చిన కొద్దిపాటి ఎరువులు కొందరికే అందుతున్నాయని సర్పంచ్‌లు ఎన్ని మన్మథరావు,మార్పు అశోకచక్రవర్తిలు ప్రశ్నించారు. స్మార్ట్ కార్డులు, ఎరువుల పంపిణీలో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని, ఎటువంటి ప్రోటోకాల్ లేని వ్యక్తులతో పంపిణీ చేస్తున్నారని వైసీపీసభ్యులు నిలదీశారు. గతంలో వైసీపీ హయంలో ప్రజాప్రతినిధులైన తమకు ఎందుకు ఆహ్వానించలేదని ,అప్పుడు ఒక న్యాయం ఇప్పుడో న్యాయం కావాలా అని టీడీపీకి చెందిన సర్పంచ్‌లు గూట్ల మల్లేశ్వరరావు,పల్లి జోగారావు ప్రశ్నించారు.ఎంపీటీసీల గౌరవ వేతనం కోసం గత మూడు సమావేశాల నుండి అడుగుతున్నా ఇంతవరకు మంజూరు చేయలేదని సభ్యులు బుడ్డా మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, మండల ఇంజనీరింగ్ అధికారి అంజిత్‌కుమార్, ఎంఈవో చిన్నవాడు వైస్ ఎంపీపీలు నక్క చింతామణి,పొందల తులసమ్మ పాల్గొన్నారు.

ఎరువుల కోసం వాగ్వాదం



సచివాలయ సిబ్బందితో వాగ్వాదంచేస్తున్న రైతులు

టెక్కలి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) మండలంలో గల నర్సింగపల్లి సచివాయం పరిధిలో గల నర్సింగపల్లి, మొఖలింగపురం పంచాయతీల రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సివస్తోంది.సచివాలయానికి 30 బస్తాలు యూరియా మాత్రమే రావడంతో సరిపోకపోవడంతో రైతుల సచివాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తక్షణమే యూరియా చెల్లాలని రైతులు చెబుతున్నారు.

కిడ్నీఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కిషోర్

పలాసరూరల్,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):పలాస కిడ్నీఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జె.కిషోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీస్(ఏపీఎంఈఎస్) కింద ఐదుగురు ప్రొఫెసర్లకు అడిషనల్ డైరక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా ప్రభుత్వం బుధవారం నియమిస్తూ ఉత్తర్వులను వెలువరించింది.ఈపదోన్నతి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉంటుందని,ఈనియామకాలు కోర్టులు/ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లోఉన్న వివిధ కేసుల ఫలితాలకు లోబడి ఉంటాయని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా ఉత్తర్వులు అందిన 15రోజుల్లోగా పోస్టింగ్‌లో చేరాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

శ్రీముఖలింగేశ్వరునికి గ్రామోత్సవం

జలుమూరు, సెప్టెంబరు 3: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామికి బుధవారం రాత్రి అర్చకులు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏకాదశి పురస్కరించుకొని ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామి దర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం గర్భగుడిలోనిల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బయటకు తీసుకొచ్చి నూతన వస్త్రాలు ధరించి పూలమాలలుతో అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఆశీనులను చేసి మంగళ వాయిద్యాలతో, వేదమంత్రాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, అచ్యుత, శివ, యోగి, పలువురు భక్తులు దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో గీతాపారాయణం

శ్రీముఖలింగం రాధా గోవిందస్వామి ఆలయంలో బుధవారం గీతాపారాయణం నిర్వహించారు. నారాయణ ఏకాదశి పురస్కరించుకొని గీతా సత్సంగ సభ్యులు, అర్చకులు గీతాపారాయణం చదివి వినిపించారు.

పశువైద్య శిబిరాల నిర్వహణకు కార్యాచరణ



మాట్లాడుతున్న టెక్కలి డివిజన్ ఏడీ నరసింహులు

పాతపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో ప్రతి 15రోజలకోసారి ఉచిత పశు వైద్యశిబిర నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని పశుసంవర్ధకశాఖ టెక్కలి డివిజన్ ఏడీ సీహెచ్ నరసింహులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయపశువైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కేలతోపాటు పాడిరైతులవారీగా విజన్ ప్లాన్ తయారుచేయాలని సూచించారు. బహువార్షిక పశుగ్రాసాల సాగు ఉపాధిహామీతో అనుసంధానం చేసి ఎక్కువమంది రైతులతో పశుగ్రాసం సాగయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మేలుజాతి ఆడదూడలు పుట్టేవిధంగా ప్రణాళికలు వేసి రైతాంగాన్ని ప్రోత్సహించాలన్నారు. పాతపట్నం ఏడీ మంచు కరుణాకరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పశువైద్యులు బి.శ్రీవాణి, పి.అనిల్,మౌనికలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్లు లీకై.. బురద నీరు సరఫరా

● ఆందోళన చెందుతున్న జగన్నాథపురం, పాత్రపురం గ్రామాల ప్రజలు

టెక్కలి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రక్షిత మంచినీటి పథకం పైపులైన్లు లీకుకావడంతో బురద నీరు వస్తుండడంతో జగన్నాథపురం, నరహరిపురం, పాత్రపురం గ్రామాలు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల ఉద్దానం ఫేజ్-2 ద్వారా మెళియాపుట్టి నుంచి డమర వరకు పైపులైన్లకోసం యంత్రాలతో తవ్వారు. దీంతో పైపులు పగిలిపోయాయి. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షం నీరు పైపులైన్లలో చేరడంతో తాగు నీరు కలుషితమవుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో కలుషిత నీరు తాగాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ నీరు తాగితే వ్యాధులు ప్రబలుతాయోమోనని భయాందోళన చెందుతున్నారు. తక్షణమే ఆయా పంచాయతీల అధికారులు స్పందించి పైపులైన్ల లీకులు అరికట్టి స్వచ్ఛమైన తాగునీరందించాలని పలువురు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక పూజలు

● కొనసాగుతున్న కుంకుమార్చనలు.. లడ్డూ వేలంపాటలు

జిల్లాలో వినాయక నవరాత్రులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం పలు చోట్ల కుంకుమపూజలు, లడ్డూ వేలంపాటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు.

నరసన్నపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ముద్దాడ వీధిలో వినాయక మండపం వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహిళలు పసుపు కుంకుమ పూజలు నిర్వహించారు. జోస్యులు సోమేశ్వశర్మ, గోపి రుత్వీకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.అలాగే చింతువానిపేటలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే తామారాపల్లి కోలవీధిలో వినాయక మండపం వద్ద లడ్డూ వేలంపాటను గ్రామానికి చెందిన కోల సింహాచలం , రూ.35,200లకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

● వజ్రపుకొత్తూరు,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పూండి సాయివీధిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రసాదం లడ్డు వేలం నిర్వహించారు.ఈ సందర్భంగా రూ. 61 వేలుకు కూన శాంతి కృష్ణారావు దంపతులు వేలంలో దక్కించుకున్నారు. అలాగే చినవంకలో వినాయకమండపానికి ఆనుకుని ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

●జలుమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిన్నదూగాంలో గణేశుని సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు గ్రామ పురోహితులు బంకుపల్లి వెంకట అప్పల శర్మ నేతృత్వంలో నిర్వహించారు. పూజల్లో చిన్నదూగాంతో పాటు తిలారు ఆర్.ఎస్, యాళ్లపేట, రామినాయుడు పేట గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: లడ్డూను వేలంపాటలో దక్కించుకున్న శాంతి, కృష్ణారావు దంపతులు

● కోటబొమ్మాళి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డపాడులో వినాయక నవరాత్రుల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో సంతబొమ్మాళి మండల విద్యార్థులు సత్తాచాటారు.ఈ మేరకు ప్రథమ, ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.కోటబొమ్మాళి మండల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలోఉత్సవకమిటీ సభ్యులు సిమ్మన్న, చందు, సుబ్బన్న, సూర్యనారాయణ, షన్ముఖ, విజయ్, కాళిదాస్, నరసింహమూర్తి, అశోక్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ఆర్. జ్యోతిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లుహాజరుకావాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉర్లాం, దేవాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్‌సరపరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడం నిమిత్తం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులు తమ పరిధిలోగల వీఏఏల ద్వారా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవోఎస్.గోవిందరావు తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నసాన సచివాలయం పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

అంధకారంలో శ్రీనివాసనగర్

పలాస, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల 16వవార్డు శ్రీనివాసనగర్‌లో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది.20రోజులుగా వీధిదీపాలు వెలగకున్నా మునిసిపల్, విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతోచీకటిలో ఇళ్లకు చేరుకోలేకపోతున్నామనిపలువురు వాపోతున్నారు. తరచూ శ్రీనివాసనగర్‌లో వీధి దీపాల సమస్య ఉత్పన్నమవుతుండడంతో శాశ్వత పరిష్కారం చూపించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేతాజీ విగ్రహావిష్కరణ



నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దండుగోపాలపురం గ్రామస్థులు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో దివంగత పొందల విశ్వేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్నిఏర్పాటుచేశారు.దీన్ని కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్ల రామ్‌గోపాలనాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా రామ్‌గోపాలనాయుడుకు రోటరీ క్లబ్ పూర్వ సహాయ గవర్నర్ ఎంఆర్‌కే దాస్ సత్కారించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మార్పు అశోక్, అట్టాడ తిరుపతిరావు, పొందల రామకృష్ణ, పాఠశాలకమిటీ చైర్మన్ భారతి హెచ్‌ఎం పిట్టగంగన్న భాస్కరరావు పాల్గొన్నారు.

క్విజ్ విజేత తీమర

పాతపట్నం సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీమర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం క్లస్టర్‌స్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా తీమర పాఠశాల విజేతగా నిలవగా తామరవిద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని ఎంఈవో-2 సీహెచ్ తిరుమలరావు తెలిపారు. విజేతలకు తీమర సర్పంచ్ ప్రతినిధి ఇప్పిలి ధనుం జయరావు బహుమతి ప్రదానంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి. సింహచలం, పుచ్చల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్యాక్సీ డ్రైవర్లకు హెచ్‌ఐవీ నివారణపై అవగాహన

టెక్కలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): టెక్కలి ట్యాక్సీస్టాండ్ వద్ద వైసీబీపీయా ట్రక్కర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కారు డ్రైవర్లు, లగేజీ వెహికల్ డ్రైవర్లకు బుధవారం హెచ్‌ఐవీ నివారణపై అవగాహన కల్పించారు.సుదూర ప్రయాణించే సమయంలో సురక్షితం కాని లైంగిక చర్యలు వల్ల హెచ్‌ఐవీ ఎలా సంక్రమిస్తుందని, ఏయే పద్ధతులు పాటించడం వల్ల హెచ్‌ఐవీ సోకే అవకాశంఉండదనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.హరినాథ్‌రెడ్డి, టాక్సీస్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.